క్లుప్తంగా

కొత్త పింఛన్లతో అవ్వాతాతలకు మరింత చేయూత



లబ్ధిదారులకు కొత్త పింఛన్లను పంపిణీ చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నానిరాజు

అమలాపురం టౌన్: కొత్తగా మంజూరై ఈ నెల నుంచే పంపిణీ చేస్తున్న సామాజిక పింఛన్లతో అవ్వాతాతలకు మరింత ఆర్థిక చేయూత లభిస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అన్నారు. స్థానిక 17, 18 వార్డులకు సంబంధించి మంజూరైన కొత్త పింఛన్లను లబ్ధిదారులకు ఆ వార్డు సచివాలయంలో నానిరాజు శుక్రవారం పంపిణీ చేసి ప్రసంగించారు. ఆయనతోపాటు 17వ వార్డు కౌన్సిలర్ దొమ్మేటి రాము లబ్ధిదారులకు కొత్త పింఛన్లను అందజేశారు. అలాగే 12వ వార్డు కౌన్సిలర్ కట్టోజు సన్నయ్యదాసు కూడా ఆ వార్డులో మంజూరైన కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కముజు రమణ, ఆయా వార్డు సచివాలయాల కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లవరం: పేరూరు నుంచి ఓడలరేవు వరకు ప్రధాన రహదారి విస్తరణ నేపథ్యంలో బెండమూర్లంక సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ రవికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గోడి, గోడిలంక, మొగళ్ళమూరు, కొమరగిరిపట్నం, ఎస్.రామేశ్వరం, రెబ్బనపల్లి, ఓడలరేవు ఫీడర్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

కీర్తి ప్రతిష్టలు సాధించాలి



గొల్లవిల్లి పాఠశాలలో విద్యార్థినిని అభినందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సంపదరావు

ఉప్పలగుప్తం: క్రీడల్లో ఉన్నతమైన విజయాలను సాధించి చదివిన పాఠశాలకు, తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు సూచించారు. మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎన్.రేవతి ఇటీవల కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్స్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ 17 హాకీ పోటీల్లో ప్రతిభను చూపి రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపిక అయ్యింది. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం సంపదరావు, హెచ్‌ఎం ఎల్.రాణి, విద్యార్థి రేవతికి శుభాకాంక్షలు తెలిపి, శిక్షణ ఇచ్చిన పీడీ గొలకోటి ఫణీంద్ర, పీఈటీలు డి.సరస్వతి, విజయభాస్కర్‌ను అభినందించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ తదితరులు

అమలాపురం రూరల్: ఈదరపల్లిగ్రామం సచివాలయం– 2లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే శుక్రవారం ప్రారంభించారు. ఈ సర్వేలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అడపా సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, మెడికల్ ఆఫీసర్ వాసునాయక్, మాజీ సర్పంచ్ నక్కా సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాల సుబ్రహ్మణ్యం



అమలాపురం టౌన్: కోనసీమ అగ్నికుల క్షత్రియ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అయినవిల్లి మండలం చింతనలంక గ్రామానికి చెందిన కర్రి బాల సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. స్థానికంగా ఓ హోటల్‌లో శుక్రవారం జరిగిన అగ్నికుల క్షత్రియ నాయకుల సమావేశంలో బాల సుబ్రహ్మణ్యం ఎన్నికను ధ్రువీకరిస్తూ కోనసీమ అగ్నికుల క్షత్రియ గౌరవాధ్యక్షుడు కర్రి స్వామినాథ్ ఆదేశాలు ఇచ్చారని కోనసీమ అధ్యక్షుడు చిలకలపూడి రవికిరణ్ తెలిపారు. సమావేశంలో పాల్గొన్న అగ్నికుల క్షత్రియ సంఘాల వివిధ మండలాల ప్రతినిధులు మార్కెండేయ ప్రసాద్, కొల్లువెంకట్, శేరుప్రసాద్, మూదే రామకృష్ణ, బాల సుబ్రహ్మణ్యంను అభినందించారు.

జీతాల పెంపు అమలు చేయాలి

యానాం: యానాం ప్రజాపనులశాఖలో సీఎల్ఆర్, ఎన్ఎంఆర్‌లుగా కొన్నేళ్లుగా సేవలు అందిస్తున్న వారి జీతాలను రూ.18వేలు చేస్తున్నట్లు అసెంబ్లీలో తీర్మానం ఆమోదించినా ఇప్పటి వరకు దాని అమలు చేయడం లేదని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శుక్రవారం పీడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణం పెంపుజీతాలను అమలు చేయాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు.

ప్రత్యేకాభివృద్ధి

- మంత్రి చొరవతో అమలాపురం నియోజకవర్గానికి నిధులు
- రూ.1.15 కోట్లు మంజూరు

ఉప్పలగుప్తం: అమలాపురం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పథకాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రాష్ట్ర రవాణా శాఖమంత్రి పినిపే విశ్వరూప్ చొరవతో నియోజకవర్గానికి 'ప్రత్యేక' నిధులు విడుదలయ్యాయి. ఈ నిధులతో అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో పలు గ్రామాల్లో ప్రధాన సమస్యలు తీరనున్నాయి.

ఇప్పటికే గడపగడపకూ మన ప్రభుత్వంలో భాగంగా ప్రతి సచివాలయంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూ.20 లక్షలను కేటాయించారు. మంత్రి ప్రత్యేక అభ్యర్థనపై నియోజకవర్గం అభివృద్ధికి అదనంగా మరో రూ.20 లక్షలను జోడించి మొత్తం రూ.40 లక్షలు ఇచ్చారు. ఇప్పటికే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన గ్రామాల్లో పనులు ప్రారంభం అయ్యాయి. వీటితోపాటు గ్రామాల్లో, పట్టణాల్లో ప్రధాన రహదారులకు ప్రత్యేక నిధులను కేటాయించి పనులు జరిపిస్తున్నారు. ఇవే కాకుండా రూ.1.15 కోట్ల ప్రత్యేక నిధుల కేటాయించి పలు గ్రామాల్లో, పట్టణాల్లో మౌలిక సదుపాయాలను అందించనున్నారు. వీటికి సంబంధించి ఇప్పటికే అంచనాలు పూర్తి చేసి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

కేటాయించిన పనులు ఇవే

- ఉప్పలగుప్తం మండలం చినగాడవిల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఎల్‌ఎస్‌పేట కాలనీలో రూ.38.5 లక్షలతో రక్షిత మంచినీటి ట్యాంకు, వెయ్యి మీటర్ల పైపులైను నిర్మాణం. ఎస్.యానం అయితాబత్తుల వారిపేటలో కల్వర్టు వెడల్పు చేయడానికి రూ.4 లక్షలు కేటాయింపు. చల్లపల్లిలో 300 వీధి లైట్లను ఏర్పాటు చేయడానికి రూ.5 లక్షల మంజూరు.
- అమలాపురం పట్టణ పరిధిలో బాలుర ఉన్నత పాఠశాలలో ఉన్న బాస్కెట్‌బాల్ కోర్టును రూ.10లక్షల వ్యయంతో ఆధునీకరించనున్నారు. పద్మినీపేటలో అసంపూర్తిగా ఉన్న సామాజిక భవన నిర్మాణాన్ని పూర్తి చేయడానికి రూ.8 లక్షలు, జిల్లా మత్స్యకార కార్యాలయంలో సదుపాయాల కల్పనకు రూ.లక్షను కేటాయించారు.
- అల్లవరం మండలంలో మొగళ్లమూరు పంచాయతీ పరిధి సిరగట్లపల్లి శివారులో రూ.35 లక్షలతో రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మిస్తున్నారు.



అమలాపురం బాలుర ఉన్నత పాఠశాలలో వర్షం నీటిలో మునిగిన బాస్కెట్‌బాల్ కోర్టు (ఫైల్)

దశాబ్దాల కల నెరవేరింది



దశాబ్దాల కాలంగా మొగళ్లమూరు పంచాయతీ పరిధిలోని శిరగట్లపల్లిలో ఉన్న తాగునీటి సమస్యకు నేటికి పరిష్కారం లభించింది. రూ.35 లక్షలతో ట్యాంక్ నిర్మాణానికి మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధల చొరవతో నిధులు మంజూరు కావడం హర్షణీయం. మా గ్రామంపై ప్రత్యేక శ్రద్ధ చూపిన మంత్రి విశ్వరూప్‌కు కృతజ్ఞతలు.

– రాయుడు విష్ణు త్రిమూర్తులు, సర్పంచ్, మొగళ్లమూరు

ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తాం



నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో పర్యటిస్తున్నాం. గ్రామ, పట్టణ పరిధిలో ప్రజలు నా దృష్టికి తీసుకుని వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించేలా అధికారులు పనిచేస్తున్నారు. ఇప్పటికే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన గ్రామాలకు రూ.20 లక్షలు ప్రకటించి పనులు ప్రారంభించాం. అదనంగా మరో రూ.20 లక్షలు కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. అమలాపురం నియోజవర్గంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం.

–పినిపే విశ్వరూప్, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి

ముగిసిన 94 గంటల హోమం

అమలాపురం టౌన్: స్థానిక ఎర్ర వంతెన సమీపంలోని బ్యాంక్ కాలనీలో శ్రీ గౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో గత 94 గంటలుగా నిర్విరామంగా సాగుతున్న వారాహి అఖండ హోమం శుక్రవారం పూర్ణాహుతితో ముగిసింది. అక్షయ పాత్ర మహిళా సాధకులు ఈ క్రతువును నిర్వహించారు. ఆ కాలనీకి చెందిన మోపిదేవి విశ్వేశ్వరరావు, సత్య గీత దంపతులు కర్తలుగా హోమాన్ని చేశారు. అక్షయ పాత్ర అధ్యక్షుడు పోతురాజు రామకృష్ణారావు ఆధ్వర్యంలో ప్రతినిధులు నూకల కుమారి, ప్రసాద్, భూసారపు లలిత, గోశాల సేవకులు కేవీ మావుళ్లయ్య, గొవ్వాల అచ్యుత రామయ్య, తూము దొరబాబు సేవలు అందించారు.

చేపల సాగుపై అవగాహన

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి గ్రామంలో సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల సంస్థ (ఎంపెడా), నాక్సా సంస్థల ఆధ్వర్యంలో షెడ్యూల్డు కులాల ఆక్వా రైతులకు చేపల సాగుపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక కన్వీనర్ జంగా బాబురావు, ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, సంస్థ సిబ్బంది ఆనంద్, దుర్గారావు, రైతులు కుసుమే వెంకన్న, జంగా శ్రీను, మాదే నాగేశ్వరరావు, బీర బాలరాజు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

అల్లవరం: కార్పొరేట్ స్థాయిలో ప్రజలందరికీ ఉచిత వైద్యాన్ని అందించేందుకు సెప్టెంబర్ 30న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్షపై మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు బాలసుబ్రహ్మణ్యం, సుమ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సురక్షపై సర్వే నిర్వహించి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించాలన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. రోగుల పరిస్థితిని అనుసరించి సలహాలు సూచనలు ఇస్తారని తెలిపారు. సచివాలయం పరిధిలోని ఏఎన్ఎం, ఆశ, వలంటీర్లు గడప గడపకూ వెళ్లి సర్వేని నమోదు చేయాలని ఎంపీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి లక్ష్మీనారాయణతో ఎమ్మెల్యే అశోక్ భేటీ

వేట నష్టపరిహారం విడుదలకు వినతి



మంత్రి లక్ష్మీనారాయణతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలో ఓఎన్‌జీసీ సంస్థ వేస్తున్న గ్యాస్‌పైపులైను వల్ల నష్టపోతున్న మత్స్యకారులకు ఆ సంస్థ మంజూరు చేసిన వేట నష్టపరిహారాన్ని బాధితుల బ్యాంకు అకౌంట్లలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని పుదుచ్చేరి పీడబ్ల్యూడీ శాఖామంత్రి లక్ష్మీనారాయణను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. శుక్రవారం పుదుచ్చేరిలో మంత్రిని కలిసి ఈ మేరకు పరిహారంపై చర్చించారు. ఇప్పటికే యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి నుంచి పుదుచ్చేరి మత్స్యశాఖ డైరెక్టర్ కార్యాలయానికి సంబంధిత ఫైలును పంపామన్నారు. ఇకపై దీనిపై ఒక రీజినల్ కమిటీ వేసి పూర్తి విచారణ అనంతరం అర్హులైన మత్స్యకారులకు వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ చేస్తామని దీనిపై ఎవరూ ఆందోళన చెందనవసరం లేదన్నారు.

చిన్నపిల్లల వార్డుకు తాళాలు.. వెనుదిరిగిన రోగులు



గడియ పెట్టి వదిలేసిన జీజీహెచ్‌లో చిన్నపిల్లల విభాగ వార్డు

యానాం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు సమయపాలన పాటించడం లేదని, ఎంతో దూరం నుంచి వ్యయప్రయాసలతో ఆసుపత్రికి వస్తున్న రోగులు నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి తలెత్తుతోందని శుక్రవారం పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం చిన్నపిల్లల వార్డు తాళం తీసినప్పటికి గడియపెట్టి వదిలేసి వెళ్లిపోయారని అన్నారు. ఎప్పటికైనా వైద్యులు వస్తారని ఎదురుచూసినప్పటికీ రాకపోవడంతో జ్వరపీడితులైన చిన్నారులను తీసుకుని నిరాశతో వెళ్లిపోయామని వారు అన్నారు. వైద్యుల సమయపాలన పాటించేలా బయోమెట్రిక్ విధానాన్ని అనుసరించాలని స్థానికులు కోరుతున్నారు.

విశ్వకర్మ జయంతికి జీవో జారీపై సీఎంకు కృతజ్ఞతలు

అమలాపురం టౌన్: విశ్వకర్మ జయంతిని ఈనెల 17న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు జీవో జారీ చేయడంపై జిల్లా చేతి వృత్తుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగాముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సూర్యనారాయణమూర్తి అమలాపురంలో శుక్రవారం ప్రకటన విడుదల చేశారు.

ఆంజనేయస్వామి విగ్రహం చేయి ధ్వంసం

ముమ్మిడివరం: స్థానిక విష్ణాలయం సెంటర్‌లో ఉన్న ఆంజనేయస్వామివారి విగ్రహం చేయిని మందుబాబు ధ్వంసం చేశాడు. నగర పంచాయతీ పల్లిపాలెంకు చెందిన ఏడిద శ్రీనివాసరావు అతిగా మద్యం సేవించి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దీనిపై స్థానిక నాయకులు ఫిర్యాదు మేరకు ముమ్మిడివరం పోలీసులు కేసు నమోదు చేశారు. మందుబాబును స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

అక్రమ మద్యం ధ్వంసం

ముమ్మిడివరం: పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యాన్ని ముమ్మిడివరం సెబ్ కార్యాలయం వద్ద శుక్రవారం ధ్వంసం చేశారు. 4 నెలలుగా 81 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 1,989 మద్యం సీసాలను ధ్వంసం చేశారు. వీటి విలువ రూ.2.90 లక్షలు ఉంటుందని సెబ్ ఎస్ఐ సీహెచ్ రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఎస్ వి.శివరామరాజు, డీఎస్ఈఓ ఖాదర్, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల ఆందోళన

యానాం: స్థానిక మున్సిపల్ ఉద్యోగులు తమ బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నెలల నుంచి వేతనాలు చెల్లించని పరిస్థితిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. జీతాలు చెల్లించకపోతే చలో పుదుచ్చేరి ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. మున్సిపల్ ఉద్యోగుల సంఘం ప్రతినిధి చెల్లి గోపీ పాల్గొన్నారు. యానాం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మల్లాడి సత్తిబాబు ఆందోళనకారుల వద్దకు వచ్చి సంఘీభావాన్ని తెలిపారు.

ఘనంగా విశ్వజన కళామండలి 45వ వార్షికోత్సవం

సేవామూర్తులకు అవార్డుల ప్రదానం



ఏఎంసీ చైర్మన్ శివన్నారాయణకు అవార్డును ప్రదానం చేస్తున్న కళామండలి ప్రతినిధులు

అమలాపురం రూరల్: విశ్వజన కళామండలి 45వ వార్షికోత్సవం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం ఘనంగా జరిగింది. కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు పర్యవేక్షణలో, జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రులు ఎమ్మెల్సీ ఇల్ల వెంకటేశ్వరరావు(ఐవీ) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో విశేష సేవలు అందించిన సేవామూర్తులకు, జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డులను 20 మందికి అందజేశారు. ముమ్మిడివరం మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది యడ్ల కుటుంబరావు, దివ్యాంగుల కోసం కృషి చేస్తున్న అమలాపురానికి చెందిన రాష్ట్ర దివ్యాంగ్ మహా సంఘటన్ అధికార ప్రతినిధి నిమ్మకాయల సురేష్‌కు జాతీయ అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డులు అందజేశారు. తాళ్లరేవు మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది పెయ్యల రమేష్, ప్రజా సంఘాల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, విశ్రాంత ఇంజినీర్ రెడ్డి గిరిబాబు, మహిళా విభాగంలో సేవలందిస్తున్న దడాల సువర్ణలత తదితరులకు స్టేట్ అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డులను అందజేశారు. ఐ.పోలవరం ఎంపీపీ మిరియం జ్యోతి, ప్రముఖులు డీవీఎస్ మూర్తి, ముసిని రామకృష్ణారావు, కామన ప్రభాకర రావు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

యానాం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా నిర్వహించే విధంగానే శుక్రవారం స్థానిక శారదా ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులకు ఇచ్చే నగదు పురస్కారం, సత్కార కార్యాక్రమను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2022–23 విద్యా సంవత్సరానికి గాను ఉత్తమ ఉపాధ్యాయురాలిగా స్కూల్ అసిస్టెండ్ కోడి మంగారత్నం(సైన్స్‌టీచర్)ను ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు చిక్కాల వెంకటేశ్వరరావు తెలిపారు. అనంతరం శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ఉపాధ్యక్షుడు కంచర్ల చిన్నబ్బాయి, కార్యదర్శి కాపగంటి ఉమాశంకర్, పీఈటీ చింతా వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొని అవార్డు గ్రహీత మంగారత్నంను రూ.10వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరించారు. 6నుంచి9 తరగతుల వరకు టాపర్ విద్యార్థులకు దివంగత కంచర్ల కామేశ్వరరావు పేరిట రూ.2వేల బహుమతిని అందజేశారు.

డిపార్ట్‌మెంటల్ టెస్ట్ ద్వారా ఎస్సై పోస్టుల భర్తీ

యానాం: పుదుచ్చేరి పోలీస్‌శాఖలో పదోన్నతి ఆధారంగా ఎస్సై, ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయడానికి శుక్రవారం డీజీజీ కార్యాలయ సూపరింటెండెంట్ సుభమ్‌ఘోష్ ప్రకటన విడుదల చేశారు. జనరల్–44, ఎస్సీ–9 మొత్తం 53 పోస్టులను ఈనెల 22 నుంచి 24 వ తేదీవరకు నిర్వహించే రాతపరీక్ష, పరేడ్ టెస్ట్ ఆధారంగా భర్తీ చేయనున్నారు. అర్హతలు, పరీక్ష సిలబస్, మెథడ్‌ఆఫ్ టెస్ట్ వివరాలు విడుదల చేసినట్లు అర్హులు 178 మంది ఉన్న జాబితాను విడుదల చేశారు. పరీక్ష మొత్తం 200 మార్కులకు ఉంటుందని ఇంగ్లిషు 50మార్కులు, జనరల్ నాలెడ్జ్ 50, చట్టాలు–100 మార్కులు, పర్సనాలిటీ టెస్ట్ 30 మార్కులు, సర్వీస్ రికార్డ్స్‌కు 20మార్కులు ఉంటాయన్నారు.

జగనన్నకు చెబుదాం అర్జీలను పరిష్కరించాలి



ముమ్మిడివరంలో అర్జీలను స్వీకరిస్తున్న జేసీ నూపుర్ అజయ్ తదితరులు

ముమ్మిడివరం: మండల స్థాయిలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూపుర్ అజయ్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎయిమ్స్ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం రెవెన్యూ డివిజన్ ముమ్మిడివరం మండలం రూరల్, నగర పంచాయతీలో నిర్వహించిన స్పందనలో 35 అర్జీలను జేసీ, ఆర్డీఓ వసంతరాయుడు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ఈ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం కోసం 1902 టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేశారన్నారు. ప్రతీ వినతి పరిష్కారమయ్యేవరకు ట్రాకింగ్ చేస్తారన్నారు. ఐవీఆర్ఎస్, ఎస్ఎంఎస్ ద్వారా పౌరులు ఎప్పటికప్పుడు తమ ఫిర్యాదుల స్థితి, పరిష్కారం గురించి తెలుసుకునే వీలుంటుందన్నారు. అర్జీల్లో అధిక శాతం రెవెన్యూ, హౌసింగ్ సంబంధించినవి ఉన్నాయని వీటిని తక్షణమే పరిష్కరించాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి ఏ.బోసుబాబు, నోడల్ అధికారి భీమేశ్వరరావు, డీఎస్ఓ ఏ.పాపారావు, తహసీల్దార్, ఎంపీడీఓ, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

వేలాదిగా తరలివచ్చిన మహిళా భక్తులు



వీరేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో శ్రావణమాసం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. స్త్రీలకు సర్వ సౌభాగ్యాలు కలగాలని శ్రావణ మాసంలో ఈ వ్రతాలు మహిళలు ఆచరిస్తారు. పోటెత్తిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. ఆలయ పురోహితులు నాగాభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమం జరిగింది. స్త్రీలకు సర్వ సౌభాగ్యాలు కలిగే శ్రావణ వరలక్ష్మి వ్రతాలు ప్రతీ సంవత్సరం ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఈఓ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన కల్యాణ మంటపం, అభిషేక మంటపం, ప్రదక్షిణలు చేసే ప్రాంగణం అంతా జిల్లా నలుమూలల నుంచి, మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 1,000 మందికి పైగా మహిళలతో నిండిపోయింది. పూజకు కావలసిన ద్రవ్యాలను దేవస్థానం ఉచితంగా అందజేసింది. పూజలో పాల్గొన్న మహిళలకు రూపు, స్వామివారి చిత్రపటం, లడ్డూ, రవిక అందజేశారు. ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణల పర్యవేక్షణలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమం అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు.

అమలాపురం రైతుబజారుకు మోక్షం



జిల్లా కార్యాలయాలు నిర్మించనున్న ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి విశాలాక్షి, ఇంజినీర్లు

అమలాపురం టౌన్: సువిశాలమైన అర ఎకరం స్థలంలో రూ.కోటి వ్యయంతో నిర్మించి నిరుపయోగంగా ఉంటున్న రైతుబజారు ప్రాంగణాన్ని తిరిగి పూర్తిస్థాయి వినియోగంలోకి తెచ్చేందుకు జిల్లా మార్కెటింగ్ శాఖ ప్రయత్నిస్తోంది. 2000 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం అమలాపురం ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలో రూ.కోట్ల విలువైన దేవదాయశాఖ స్థలంలో మోడరన్ పేరుతో 90 దుకాణాలతో రైతుబజార్‌ను నిర్మించింది. తొలుత పది కూరగాయల దుకాణాలకు తర్వాత ఒకే ఒక దుకాణానికి పరిమితమై మిగిలిన దుకాణాల సముదాయం మొత్తం నిరుపయోగంగా ఉంటోంది. ఈ క్రమంలో రైతుబజారును జిల్లా మార్కెటింగ్ శాఖ అవసరాలకు వినియోగించాలని నిర్ణయించారు. రైతుబజార్‌లో ఉన్న దుకాణాల సముదాయాలకు తోడు ఇంకా మిగిలి ఉన్న ఖాళీ స్థలాల్లో జిల్లా మార్కెటింగ్ శాఖ (అసిస్టెంట్ డైరెక్టర్) కార్యాలయాన్ని, ఆ శాఖ డీఈఈ కార్యాలయాన్ని, అమలాపురం వ్యవసాయి మార్కెటింగ్ కమిటీ కార్యాలయాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ రైతుబజార్‌ను జిల్లా మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.విశాలాక్షి ఆ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి గురువారం స్వయంగా పరిశీలించి ఆ మూడు కార్యాలయాలు నిర్మించేందుకు ఈ ఖాళీ స్థలాలు అనువైనవిగా గుర్తించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నిరుపయోగంగా ఉన్న ఈ రైతు బజార్‌లోకి చేపల మార్కెట్‌ను తరలించి దీనిని పూర్తి స్థాయి వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నించింది. ఆ దిశగా ఏర్పాట్లు కూడా చేసింది. ఈ లోగా జిల్లా కేంద్రం కావడంతో ఈ మూడు కార్యాలయాల నిర్మాణానికి నిర్ణయం తీసుకుంది.



క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో సత్తిరాజు, ఉపాధ్యాయులు

క్రీడల్లో భీమనపల్లి విద్యార్థుల ప్రతిభ

ఉప్పలగుప్తం: మండలంలో భీమనపల్లి శిరంగు రంగనాయకమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 14, అండర్ 17 క్రీడలు శుక్రవారంతో ముగిశాయి. ఈ క్రీడల్లో భీమనపల్లి పాఠశాలకు చెందిన బాలుర జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయని పీడీ కామన మధుసూదనరావు శుక్రవారం తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో జరిగే క్రీడల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు, హెచ్ఎం నూకల సత్యనారాయణ, పీఎంసీ చైర్మన్ సబ్బతి జ్యోతి, ఉపాధ్యాయులు అభినందించారు.